ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 1 మార్చి 2024





బలహీన వర్గాల హక్కుల రక్షణే కాంగ్రెస్ ధ్యేయం 8లో..

అంజన్న ఆలయ ఉద్యోగి సస్పెన్షన్
● డబ్బుల దుర్వినియోగం అభియోగం 7లో..


# విచ్చలవిడిగా సిజేరియన్లు



- ప్రైవేటు ఆసుపత్రుల్లో 87 శాతం ప్రసవాలు ఆపరేషన్లతోనే
- సాధారణ కాన్పులకు ప్రయత్నించని వైద్యులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో 65 శాతం మాత్రమే

జగిత్యాల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సాధారణ కాన్పు చేయించడంలో ప్రైవేటు ఆసుపత్రులు నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. ఉన్నతాధికారులు పలు పర్యాయాలు ఆదేశించినప్పటికీ కాసుల కోసం ఆశ పడి పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా సిజేరియన్ డెలివరీలు చేస్తున్నారు. ఓ వైపు ఆసుపత్రి ఖర్చులను భరించడంతో పాటు సిజేరియన్ కాన్పు తదుపరి వచ్చే సమస్యలను మహిళలు ఎదుర్కోవాల్సి వస్తోంది. శస్త్ర చికిత్స డెలివరీలు నిర్వహిస్తేనే ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులకు కాసుల గలగలలు ఉండనుండడంతో ఆ దిశగా కాన్పులు చేస్తున్నారు. సాధారణ కాన్పుల వైపు దృష్టి సారించడం లేదు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మ పురి, రాయికల్ పట్టణాలతో పాటు వివిధ ప్రాంతాల్లో గల పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇష్టారీతిన ప్రసవ కోతలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యులు ముందునుంచి సన్నద్ధం చేయకపోవడం గర్భిణీ కుటుంబీకులు సాధారణ ప్రసవానికి ముందుకు రాకపోవడం ఇతరత్రా కారణాలు అందుకు దోహదం చేస్తున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు విని పిస్తున్నాయి. ఈ తరుణంలో సదరు ఆసుపత్రులపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించేందుకు సిద్ధం కావాల్సిన అవసరముంది.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్స ప్రసవాల సంఖ్య...

జిల్లాలోని పలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏప్రిల్ 2023 నుంచి జనవరి 2024 సంవత్సరం వరకు 10,409 కాన్పులను నిర్వహించారు. ఇందులో 2,528 సాధారణ కాన్పులు, 7,881 శస్త్ర చికిత్స కాన్పులు నిర్వహించారు. జిల్లాలో శస్త్ర కాన్పులు 76 శాతం జరగగా, సాధారణ కాన్పులు 24 శాతం మాత్ర మే జరగడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 5,405 కాన్పులు నిర్వహించగా ఇందులో సాధారణ కాన్పులు 1,879, శస్త్ర చికిత్స కాన్పులు 3,526 నిర్వహించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు 35 శాతం ఉండగా, శస్త్ర చికిత్స ప్రసవాలు 65 శాతం ఉన్నా యి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వంద శాతం సాధా రణ ప్రసవాలు జరగడం అభినందనీయంగా ఉంది. మరోవైపు ఆరోగ్య సిబ్బంది గర్భిణులకు ముందు నుంచి చిన్నపాటి వ్యాయామాలు చేయిస్తున్నారు. ఫలితంగా గతంతో పోల్చితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొంత మార్పు స్పష్టమవు తోంది. ఎక్కువ శాతం సాధారణ ప్రసవాలకు పీహెచ్‌సీల్లో ప్రాధాన్యం ఇస్తున్నారు.

### ఆర్జించేందుకు ఆపరేషన్లు...

జిల్లాలో పలు ప్రైవేటు ఆసుపత్రులు కేవలం డెలివరీలు నిర్వహిం చడానికి కొనసాగుతున్నాయి. కాన్పుల్లో శస్త్రచికిత్సలకు పెద్దపీట వేస్తున్నా రు. 87 శాతం మేర ఆ జాబితాలో ఉండటం ఇందుకు నిదర్శనం. కేవలం 13 శాతం మాత్రమే సాధారణ కాన్పులు జరుగుతున్నాయి. సాధారణం మినహాయిస్తే వివిధ రకాల రుసుముల పేరిట రూ. 40 వేలు మొదలు రూ. లక్ష వరకు చార్జీలు విధిస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో షూరిస్కు పేరి ట అడ్డగోలుగా రాబడుతున్నారు.

గర్భిణులకు సాధారణం వైపు ప్రేరేపించడం, కుటుంబ సభ్యులకు ప్రోత్సహించడంలో మాత్రం వెనుకబడుతున్నారు. మరోవైపు జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రైవేటు దవాఖానాలను తరు చూ తనిఖీ చేయాల్సి ఉన్నా ఆ దిశగా పర్యవేక్షణ కొరవడుతోంది. కొన్ని చోట్ల స్కానింగ్‌లు, వివిధ రకాల పరీక్షల పేరిట ఇష్టారీతిన సొమ్ము వసూలు చేస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని పేద, మధ్య తరగతి కుటుం బాలు విజ్ఞప్తి చేస్తున్నాయి



### ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ల సంఖ్య..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏప్రిల్ 2023 నుంచి జనవరి 2024 వరకు 5,004 ప్రసవాలు నిర్వహించారు. ఇందులో కేవలం 649 ప్రసవాలు సాధారణంగా జరిగాయి. 4,355 శస్త్ర చికిత్స ప్రసవాలు నిర్వహించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు 13 శా తం ఉండగా, శస్త్ర చికిత్స ప్రసవాలు 87 శాతం మేరకు ఉన్నాయి. ప్రై వేటు ఆసుపత్రుల నిర్వాహకులు అత్యధికంగా శస్త్ర చికిత్స ప్రసవాలను నిర్వహిస్తున్నారు. ఒకప్పటితో పోల్చితే కొన్నేళ్లుగా మరింత శస్త్ర చికిత్స కాన్పులు పెరుగుతుండడం ఆందోళనను కలిగిస్తోంది.

### ప్రత్యేక దృష్టి సారిస్తాం..

**పుప్పాల శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జగిత్యాల**



జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యధికంగా శస్త్ర చికిత్స విధానంలో ప్రసవాలు జరుగుతున్న అంశం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము. నిబంధ నలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నోటీసులు అందిస్తాము. తనిఖీలు ముమ్మరం చేస్తాము. ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు తల్లీ బిడ్డ ఆరోగ్యం దృష్ట్యా సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

## విప్ ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకోండి

**జడ్పీ సీఈవోకు ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ ఫిర్యాదు**



జడ్పీ సీఈవోకు ఫిర్యాదు అందిస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్‌లు

జగిత్యాల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో బీఆర్ఎస్ విప్ దిక్కరించిన కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జడ్పీ సీఈవో గౌతం రెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ ఫిర్యాదు చేశారు. గురువారం పట్టణంలో జడ్పీ సీఈవో, మున్సిపల్ ఎన్నికల అధికారి గౌతం రెడ్డిని కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 29 మంది కౌన్సిలర్లు అనుసరించాల్సిన విధానంపై విప్‌ను జారీ చేశామన్నారు. బీఆర్ఎస్ సూచించిన అభ్యర్థికి ఓటు వేయాలని విప్ జారీ చేయగా, ఎన్నికల సమయంలో అధికారులు సైతం బీఆర్ఎస్ విప్ గురించి సభ్యులకు వివరించారని గుర్తు చేశారు. విప్ దిక్కరించిన కౌన్సిలర్లు పదవీచ్యుతులను చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు బద్దం మోహన్ రెడ్డి, బొడ్ల జగదీశ్, పిట్ట ధర్మరాజు, ఆవారి శివకేసరి, జుంబర్తి రాజుకుమార్, కూతురు రాజేశ్, కప్పల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మామిడి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రాయికల్, ఫిబ్రవరి 29: పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం దత్తత గ్రామాలైన మండలంలోని అల్లీపూర్‌లో మామిడి తోటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ప్రస్తుతం మామిడి పిందె దశలో ఉండటంతో నీటి తడులను ప్రారంభించాలని సూచించారు. కాయ పెరుగుదలకు యూరియా, పొటాష్‌లను 1.5 కి. మరియు 0.75 కి. చొప్పున ఒక్కో చెట్టుకు వేయాలన్నారు. అలాగే తేనె మంచు, తామర పురుగులు, బూడిద తెగులు ఉన్నట్లు గమనించారు. దీని నివారణకు థయోమిథాక్సామ్ 200 గ్రా. చొప్పున 500 లీ. నీటికి మరియు హెక్సాకొనజోల్ 500 మి.లీ. ప్లానోఫిక్స్ 110 మి.లీ. 500 మి.లీ., ప్లానోఫిక్స్ 110 మి.లీ. 500 లీ. నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అనంతరం నువ్వు పంటలను పరిశీలించి విత్తనోత్పత్తి చేస్తున్న క్షేత్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో దత్తత గ్రామ ఇన్‌ఛార్జి డాక్టర్ రజనీ దేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ రవి, డాక్టర్ స్వాతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా లలితాంబిక విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం

రాయికల్, ఫిబ్రవరి 29: రాయికల్ పట్టణంలో బుధవారం లలితాంబిక విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జడ్పీటీసీ జాదవ్ అశ్విని పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, బొడుగం శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బన్న సంజీవ్, తోపారపు ఆశన్న, మంగళారపు లక్ష్మీనారాయణ, గంగాధర్, సింగాని సతీష్, అజయ్ పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బోగ శ్రావణి

# నేర విచారణ సమర్థవంతంగా ఉండాలి

**ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్**

జగిత్యాల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): నేర విచారణ మరింత సమర్థవంతంగా చేయడంతో పాటు కేసులను సత్వరం పరిష్కరించే విధంగా పోలీసు అధికారులంతా సమర్థవంతంగా పనిచేయాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. గురువారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేర విచారణ ఉండాలన్నారు. అన్ని స్థాయిలలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ ముందుకు సాగాలన్నారు. పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే ప్రతీ కేసు వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్క రించాలన్నారు. డీఎస్పీలు, సీఐలు తమ పరిధిలో ఉండే పోలీస్ స్టేష న్లలో నమోదైన వివిధ రకాల కేసులు స్థితిగతులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని కోరారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతీ రోజు డ్రండ్ డ్రైవ్ టెస్టులు, వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నిఘా పెంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రంగారెడ్డి, డీసీఆర్‌బీ, సీసీఎస్, ఎస్‌బీ, ఐటీ కోర్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, రఫీక్ ఖాన్, జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, డీసీఆర్‌బీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన పోలీసు అధికారులు..మాట్లాడుతున్న ఎస్పీ(ఇన్‌సెట్‌లో)

### జిల్లా వ్యాప్తంగా సిటీ పోలీస్ యాక్ట్ అమలు

శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి ఒకటవ తేదీ నుంచి 31వ తేదీ వరకు పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని వివరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్థులకు నష్టం కలిగించే విదంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదని తెలిపారు. పోలీసు శాఖకు జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

## ఎమ్మెల్సీని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్



జీవన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని గురువారం జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కలిశారు. నూతనంగా ఎన్నికయిన సందర్భంగా ఎమ్మెల్సీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అడువాల జ్యోతిని జీవన్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడువాల లక్ష్మణ్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో గురువారం అడువాల జ్యోతి లక్ష్మణ్‌ను పూజలు నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా ఎన్నికయిన అనంతరం తొలిసారిగా ఆలయానికి వచ్చిన వారికి పలువురు పద్మశాలీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి అభినందిచడంతో పాటు శాలువ కప్పి సత్కరించారు.

# మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

- ● జిల్లాలో నూతనంగా 20 మీ సేవా కేంద్రాలు
- ● కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో 20 మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. భీమారం మండలం వెంక ట్రావుపేట, బుగ్గారం మండలం గోపులాపూర్, ఎండపల్లి మండలం గుల్లకోట, జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం, కథలాపూర్ మండలం ఇప్పపల్లి, కొడిమ్యాల మండలం నమిలికొండ, మేడిపల్లి మండలం వల్లంపల్లి, పెగడపల్లి మండలం మద్దులపల్లి క్రాస్ రోడ్డులలో ఒక్కోటి చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా మెట్‌పల్లి మండలం చౌలమద్ది, మెట్లచిట్టాపూర్, ధర్మపురి మండలం రాయపట్నం, జైనా, ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి, ఎర్దండి, కోరుట్ల మండలం వెంకటాపూర్ క్రాస్ రోడ్డు, కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్, మల్లాపూర్ మండలం రేగుంట, మొగిలిపేట, రాఘవపేటలలో ఒక్కోటి చొప్పున మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల ఫిబ్రవరి 29వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఏదయిన గ్రాడ్యుయేట్ గానీ అంతకంటే ఎక్కువ విద్యార్హతతో కంప్యూటర్ పరిజ్ఞానం కలిగియున్న నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారు వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండాలని, జిల్లాలోని అదే మండలానికి, గ్రామ పంచాయతీ, సమీప గ్రామ పంచాయతీకి చెందిన వారై ఉండాలని, నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో అనుమతించబడిన అభ్యర్థులకు మాత్రమే తదుపరి పరీక్షకు అర్హత ఇవ్వబడుతుందన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ విధానం ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

## కంప్యూటర్ కోర్సులలో ఉచిత శిక్షణ

జగిత్యాల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు ఫుడ్ అండ్ బేవరేజ్ కంట్రోలర్, డొమెస్టిక్ ఐటి హెల్ప్ డెస్క్ అటెండెంట్ సంస్థ కంప్యూటర్ కోర్సులలో ఉచితంగా శిక్షణ, ఉపాధి ఇవ్వనున్నట్లు సంస్థ నిర్వాహకులు ఎక్కలూరి వెంకట్ రెడ్డి తెలిపారు. ఆసక్తి గలవారు జగిత్యాల తహసీల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జాన్సన్ కంప్యూటర్ నందు మార్చి 5వ తారీఖు లోపు సంప్రదించాలని కోరారు. వయస్సు 18 నుంచి 35లోపు ఉన్న యువతి, యువకులు ఒరిజనల్ సర్టిఫికేట్స్, పదోతరగతి విద్యార్హత పత్రంతో పాటుగా ఆదాయం సర్టిఫికెట్, రెండు ఫొటోలు, ఆధార్‌కార్డుతో సంప్రదించాలన్నారు. వివరాలకు సెల్ 9849845642 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

## మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కేసులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 29 : విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని కొడిమ్యాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షల చీఫ్ సూపరిండెంట్ జె. ఇందూర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి, మానసిక ఆరోగ్య సమస్యలు, భయాందోళనలు ఉంటే వాటి పరిష్కారం కోసం కౌన్సిలింగ్, మార్గదర్శకత్వం కోసం సైక్రాటిస్టుల సేవలను 14416, లేదా1880-914416 కాల్ చేసి సలహాలను పొందాలన్నారు. నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమతి లేదన్నారు.

## రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

పెగడపల్లి, ఫిబ్రవరి 29 : రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నంచర్లలో ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులను గురువారం ఎంపీడీవో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, ఏఈ శంషేర్ అలీ ఉన్నారు.

## జాతర ఏర్పాట్లపై సమన్వయ సమావేశం

రాయికల్, ఫిబ్రవరి 29: రాయికల్ మండలంలోని కొత్తపేట గ్రామంలో గల శ్రీ రాజరాజేశ్వర నాగాలయంలో జాతర ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరలో తీసుకోవాల్సిన ముందస్తు ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, మండల వైద్యాధికారి శ్రీధర్, ఏఈ రాజేశం, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచులు బత్తిని రాజేశం, మన్నెగండ్ల వెంకమ్మనర్సయ్య, మీనుగు అంబయ్య, చింతలపల్లి గంగారెడ్డి, పోలీస్, ఫైర్ సిబ్బంది, ఆలయ మాజీ చైర్మన్ ధనకంటి ప్రవీణ్, అర్చకులు రాజేశ్వర్ శర్మ, సిబ్బంది నర్సయ్య పాల్గొన్నారు.

## ప్రారంభమైన క్రీడా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్

రాయికల్, ఫిబ్రవరి 29: రాయికల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికిగాను వార్షిక క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఖయ్యూం, జాతీయ క్రీడాకారుడు గణేష్‌లు హాజరై క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ చేస్తూ అతిథులకు ఆహ్వానం పలికారు. అనంతరం ఒలంపిక్ క్రీడా జ్యోతిని వెలిగించి స్పోర్ట్స్ ఫ్లాగ్‌ను ఎగురవేసి ఆటలను ప్రారంభించారు. జాతీయ అథ్లెటిక్స్‌కు ఎంపికైన గణేష్‌ను సన్మానించారు. పాఠశాల డైరెక్టర్ తిరుపతిరావు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రావు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

కథలాపూర్, ఫిబ్రవరి 29 : మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు రు. 1.50 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కుల సంఘాలు, మహిళా సంఘాలు, బోర్లు, మోటర్ల ఏర్పాటుకుగాను నిధులు కేటాయించినట్లు చెప్పారు. నిధుల మంజూరు పట్ల పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

## నేషనల్ హైవే రహదారి నమూనా పరిశీలన

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 29 : జగిత్యాల మండలం తిప్పన్నపేట మీదుగా వెళ్తున్న ఎన్‌హెచ్-63 (ఆర్మూర్-మంచిర్యాల) నేషనల్ హైవే రహదారి నమూనాను గురువారం నేషనల్ హైవే పీడీ పరిశీలించారు. ఈసందర్భంగా భూములు కోల్పోతున్న తిప్పన్నపేట, గోపాల్‌రావుపేటకు చెందిన రైతులు అక్కడికి చేరుకొని రహదారి అలైన్‌మెంట్ నమూనాపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం రహదారి నిర్మాణాన్ని మార్చాలని పీడీకి విన్నవించారు. ఈ నెల 5 తర్వాత రైతుల అభ్యంతరాలపై విచారణ చేపడతానని పీడీ తెలిపారు.

# ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి శ్రమించాలి

**మెట్‌పల్లి మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్**

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 29 : ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి మరింత శ్రమించాలని మెట్‌పల్లి మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. జాతీయ షాట్‌పుట్‌కు ఎంపికైన పట్టణానికి చెందిన గజ్జెల్లి హన్సిక, కోర్టులో విధులు నిర్వహిస్తున్న విశ్వాస్, భాస్కర్‌లకు గురువారం కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి షాట్‌పుట్ క్రీడలో ఎంపికైన హన్సిక మెట్‌పల్లి పేరును నిలబెట్టాలని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు బదిలీ కావడం సహజమని, తమ విధులను సక్రమంగా నిర్వహించే వారికి ఎక్కడైనా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కోర్టు బెంచ్‌కు మధ్య చాలా సహకారం అందించే ఉద్యోగస్తులు భవిష్యత్తుల్లో ప్రమోషన్లు పొంది ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు ఓజ్జెల శ్రీనివాస్, ప్రధానకార్యదిర్శ తెడ్డు ఆనంద్, న్యాయవాదులు వెంకటనర్సయ్య, వడ్డేపల్లి శ్రీనివాస్, రాజ్ మహమ్మద్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, స్రవంతి, శంకర్‌రెడ్డి, అశోక్, ప్రవీణ్‌రావు, స్వప్న, నర్సగౌడ్, సుధకర్, మోహన్‌రెడ్డి, లక్ష్మణ్, రాందాస్, రాజేందర్, శంకర్, నర్సయ్య పాల్గొన్నారు.



మెట్‌పల్లి కోర్టు సిబ్బందిని సన్మానిస్తున్న మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్

## ఘనంగా వేంకటేశ్వర కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని మోహన్ రావుపేట గ్రామంలో గురువారం వేంకటేశ్వర కల్యాణం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని గుట్టపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు పూజలు నిర్వహించారు. కోరుట్ల జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య - రాజేష్, ఎంపీపీ తోట నారాయణలు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కారుగూరి నర్సయ్య పాల్గొన్నారు.

## రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 618క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఆరు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 6వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. బుధవారం క్వింటాల్ పత్తి 7,400 పలికింది. ప్రస్తుతం మరో 150 రూపాయలు పెరుగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### పురుగుల మందు తాగిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన

## బ్లూకోల్ట్స్ సిబ్బందికి సీపీ రివార్డు


కానిస్టేబుల్‌కు నగదు రివార్డును అందజేస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం/ వీణవంక, ఫిబ్రవరి 29: పురుగుల మందు తాగిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ జైపాల్, హోంగార్డు సంపత్‌కు కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి నగదు రివార్డు అందజేసి అభినందించారు .మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన కుర్ర సురేష్ ఇంట్లో గొడవపడి పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి డయల్ 100 కు కాల్ చేశారు. సమాచారం అందుకున్నా బ్లూకోల్ట్స్ సిబ్బంది 15 నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌ను కానిస్టేబుల్ జైపాల్ తన భుజాన వేసుకుని సుమారు రెండు కిలోమీటర్ల మేర పొలాల గట్ల మీద పరిగెడుతూ గ్రామంలోకి తీసుకొచ్చాడు. అనంతరం అతడిని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించి ప్రాణాలను కాపాడారు. వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు పరిస్థితులకు అనుకూలంగా వ్యవహరించిన కానిస్టేబుల్ జైపాల్, హోంగార్డు సంపత్‌లను పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్, ఫిబ్రవరి 29: మండలంలోని వచ్చునూర్‌లో ఆర్థిక ఇబ్బందులతో ఓ యువ కుడు బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వచ్చునూర్ గ్రామానికి చెందిన బొంగాని రాజు(39) కొన్ని రోజులుగా నరాల బలహీనతతో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో కొన్ని రోజులుగా మనోవేదన చెందుతున్నాడు. రాజు భార్య తన తల్లిగారింటికి వెళ్లింది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున రాజు తల్లి బొంగాని మల్లవ్వ చూసి స్థానికులకు తెలిపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఇల్లందకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని లక్ష్మాజిపల్లె గ్రామానికి చెందిన రావుల రాజుకు పోలీసులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేశారు. ఇటీవల అతడి సెల్‌ఫోన్ పోయింది. దీంతో అతడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సెల్‌ఫోన్ గుర్తించి రాజుకి అప్పగించారు.

## మక్తపల్లివాసికి భారత సమ్మాన్ పురస్కారం


చింతం నరేందర్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 29: మండలంలోని మక్తపల్లి గ్రామానికి చెందిన చింతం నరేందర్ ఇటీవల న్యూఢిల్లీలో విధానసభ స్పీకర్ శ్రీరాం నివాస్ గోయల్ చేతుల మీదుగా భారత సమ్మాన్ పురస్కారం అందు కున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన నరేందర్ సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. పలు ఇన్నోవేటివ్ జర్నల్స్ మార్కెట్లో విడుదల చేసినందుకు గాను చింతం నరేందర్‌ను ఈనెల 23న ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

## అంజన్న ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
● నిధులు దుర్వినియోగం చేశాడని అభియోగం

మల్యాల, ఫిబ్రవరి 29: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వేలం పాటల ఇన్‌చార్జిగా విధులు నిర్వహించిన కె.శ్రీనివాసాచారిని సస్పెండ్ చేస్తూ ఈవో. టి.వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం పరిధిలోని వ్యాపారులు చెల్లించిన టెండర్లకు సంబంధించిన రూ.37.90లక్షలు దేవస్థానం ఖాతాలో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ సస్పెన్షన్ వేటు వేశారు. కొండపైన దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు విడతల వారీగా తమ సొమ్ములు దేవస్థానానికి చెల్లిస్తుండగా కొన్నాళ్ల క్రితం ఆ బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసాచారి వాటిని దుర్వినియోగం చేసినట్లు వారం రోజుల క్రితం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆలయ అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు గురువారం సస్పెన్షన్ చేశారు. సస్పెన్షన్‌తో పాటు అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఈవో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని లోతుగా విచారణ జరిపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులను కోరుతున్నారు.

### గిరిజన క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 29: రాష్ట్రంలోని గిరిజన క్రీడా పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన శాఖ అభివృద్ధి శాఖ అధికారి తెలిపారు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ, ఆదిలాబాద్ జిల్లా బాలుర మోడల్ స్పోర్ట్స్ పాఠశాల(జాతర్ల), కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని బాలుర పాఠశాల, ఆదిలాబాద్ జిల్లా బాలుర పాఠశాల(ఉట్నూర్), మహబూబ్‌నగర్ జిల్లా కొత్తగూడ బాలుర పాఠశాలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా బాలికల పాఠశాల, కొత్తగూడెం జిల్లా కాచనపల్లి బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల గిరిజన బాల, బాలికలు తమ దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. విద్యార్థుల వయస్సు 31-08-2024 నాటికి 9 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలలోపు ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా దేహదారుఢ్య పరీక్షల అనంతరం ఎంపిక చేస్తారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మార్చి 4 నుంచి 6వరకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 90591 75379 నంబరులో సంప్రదించాలన్నారు.

### నేటి నుంచి న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్లు రమణారెడ్డి, పీవీకే కిషోర్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 3వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో న్యూరో డాక్టర్ల 8వ రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు కమిటీ చైర్మన్ డాక్టర్ రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పీవీకే కిషోర్ తెలిపారు. గురువారం నగరంలోని సుభాష్‌నగర్‌లో గల భద్రకాళి ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలు తెలియచేశారు. శుక్రవారం రెనే ఆసుపత్రిలో బ్రెయిన్ ట్యూమర్, అంబర్ డిస్క్ సర్జరీలు, చల్మెడ మెడికల్ కాలేజీలోని న్యూరో విభాగం ఆధ్వర్యంలో మెదడు, వెన్నుపాముకు సంబంధించిన లైవ్ సర్జరీలు ఉంటాయని తెలిపారు. న్యూరో విభాగంలో వచ్చిన అధునాతన వైద్యం గురించి లైవ్ సర్జరీల ద్వారా తెలుసుకుంటారని అన్నారు. మార్చి 2న సాయంత్రం నగరంలోని వీ కన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సు న్యూరో డాక్టర్లు, న్యూరో వైద్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

### వేములవాడలో జాతర ఏర్పాట్ల పరిశీలన

వేములవాడ ఫిబ్రవరి 29 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఆలయ ఈఈ రాజేష్, డి ఈ రఘునందన్ లతో కలిసి ఆలయ పరిసరాలలో జాతర ఏర్పాట్లు పరిశీలించి అనంతరం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జాతర సందర్భంగా తాగునీటి సరఫరా, క్యూ లైన్ల నిర్వహణ, ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

### నాగేంద్ర సహిత మానసా దేవి యంత్రం ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న భక్తులు, నాగేంద్ర సహిత మానసాదేవి విగ్రహాలు

కోరుట్ల, ఫిబ్రవరి 29 : పట్టణంలోని సత్య అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం నాగేంద్ర సహిత మానసా దేవి యంత్రస్థాపన కార్యక్రమాన్ని వేదపండితుడు పాలెపు రాంశర్మ, వినయ్, కపిల్‌శర్మ మంత్రోచ్ఛరణ మధ్య ఘనంగా సాగింది. ఈ సందర్భంగా వాస్తు దేవతా పూజలతో పాటు నాగేంద్ర సహిత మానసాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, నిర్వాహకులు గడ్డమీది రాజన్న, మక్కు ధర్మరాజు, దామోదర్ పాల్గొన్నారు.

### ఈ నెల14న ఎస్‌యూలో కామర్స్ మీట్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌యూ వీసీ మల్లేష్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 29: శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మార్చ్ 14న శాతవాహన వికల్ప2024 (కామర్స్ మీట్)ను నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్ గురువారం కామర్స్‌మీట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత, పోటీతత్వం పెంపొందించుకోవటానికి శాతవాహన వికల్ప ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అందుకే విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న అన్ని డిగ్రీ,పీజీ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శాతవాహన వికల్ప-2024 కన్వీనర్ డాక్టర్ డి హరికాంత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే కామర్స్‌మీట్ వల్ల విద్యార్థులు వివిధ అంశాలపట్ల అవగాహన పెంచుకొని నూతన మెలుకువలు నేర్చుకోవచ్చని అన్నారు. కామర్స్ మీట్‌లో గెలుపొందిన విద్యార్థులకు తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ప్రేరణ-2024 రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ విభాగాధిపతి మనోహర్, అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, బి నరేష్, డాక్టర్ పరశురాములు, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, వేణుమాధవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# టీఎస్‌టీపీపీ స్టేజ్-1 నిర్మాణం సంపూర్ణం

● 800 మెగావాట్ల రెండో యూనిట్‌కు కమర్షియల్ ఆపరేషన్(సీవోడీ) ప్రకటన
● అందుబాటులో 1600 మెగావాట్లు ● 4న జాతికి అంకితం చేయనున్న ప్రధాని

జ్యోతినగర్, ఫిబ్రవరి 29: ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) స్టేజ్ 1 నిర్మాణం సంపూర్ణమైంది. ఈ ప్రాజెక్టులోని 800 మెగావాట్ల సామర్థ్యం గల 2వ యూనిట్‌ను గురువారం అర్ధరాత్రి(00.00 గంటలు) కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్(సీవోడీ)గా ప్రకటించారు. ఈ యూనిట్ పూర్తిస్థాయి ఉత్పత్తి దశకు చేరుకోవడం, సీవోడీ ప్రకటనతో మొత్తం 1600 మెగావాట్ల(800 మెగావాట్ల 2 యూనిట్లు) మొదటి దశ పూర్తయింది. 800 మెగావాట్ల 2వ యూనిట్‌కు సంబంధించి ఫిబ్రవరి 11న ట్రయల్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఐదు నెలల క్రితమే 800 మెగావాట్ల సామర్థ్యంగల 1వ యూనిట్‌ను సీవోడీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో టీఎస్‌టీపీపీ స్టేజ్ 1 ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణ రాష్ట్రానికే సరఫరా చేస్తారు. స్టేజ్-2లో 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టును నెలకొల్పాల్సి ఉంది. అయితే స్టేజ్ 2కు సంబంధించి కీలకమైన విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకోవాల్సి ఉంది. స్టేజ్ 2కు ఇప్పటికే ఎన్టీపీసీ బోర్డు(బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు) అనుమతి ఉంది. కాగా, మార్చి 4న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెకు స్టేజ్ 1ను జాతికి అంకితం చేయనున్నారు. 4న ప్రధాని ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా అక్కడి నుంచే వర్చువల్ విధానంలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారని సమాచారం.

● సుదీర్ఘ కాలం తరువాత

అనేక సవాళ్లు, అవాంతరాల తరువాత తెలంగాణ సూపర్ థర్మల్ ప్రాజెక్టు పూర్తయింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం 4000 మెగావాట్ల ప్రాజెక్టును



తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నెలకొల్పాలని పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా 2016లో పునాదిరాయి పడి స్టేజ్-1 మొదట్లో వేగంగా నిర్మాణ పనులు జరిగినా కరోనా, సాంకేతిక కారణాల వల్ల తీవ్ర జాప్యమైంది. 2020-21లోనే ప్రాజెక్టులోని మొదటి, రెండవ యూనిట్లను పూర్తి చేయాలని ప్రణాళికలు రూపొందించినప్పటికీ కరోనా, సాంకేతిక సమస్యలు రావడంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. ఏడాదిన్నర కాలంగా ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగంగా చేయడం ద్వారా స్టేజ్ 1లో రెండు యూనిట్లు ఉత్పత్తి దశకు చేరాయి. రామగుండంలోని తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టిఎస్‌టిపిపి) 800 మెగావాట్ల 2వ యూనిట్ ఉత్పత్తి దశలోకి రావడంతో ఎన్టీపీసీ సంస్థ స్థాపిత సామర్థ్యం 74,758 మెగావాట్లకు చేరింది.

## యువకుడి ఆత్మహత్య



చొక్కాల అరవింద్(ఫైల్)

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 29:తాను ప్రేమించిన అమ్మాయికి వేరే యువకుడితో వివాహం కుదరడంతో మనస్థాపం చెందిన చొక్కాల అరవింద్(20) అనే యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మండలం చింతలఠాణా గ్రామానికి చెందిన చొక్కాల లక్ష్మణ్-దేవవ్వ దంపతుల కుమారుడు చొక్కాల అరవింద్ అనే యువకుడు ఓ యువతిని కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. అయితే సదరు యువతికి వేరే అతనితో వివాహం కుదిరింది. తనను కాదని వేరే అబ్బాయిని వివాహం చేసుకుంటుందనే కోపం పెంచుకున్నాడు. దీంతో అరవింద్ సదరు అమ్మాయితో దిగిన ఫొటోలను వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేయడంతో సమస్య పెద్దదైంది. హైదరాబాద్‌లో ఉన్న అరవింద్‌ను తండ్రి మందలించి ఇంటికి రావాలని కోరారు. ఇంటికి వస్తున్నానని చెప్పిన అరవింద్ వేములవాడ నందికమాన్ సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికి ఎదిగిన కొడుకు ప్రేమ విషయంలో మనస్థాపం చెంది మృతి చెందడంతో కన్నవారు రోధించిన తీరు పలువురిని కలిచివేసింది. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

### కుక్కలదాడిలో 20 గొర్రెలు మృతి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని గాలిపల్లి సమీపంలో కుక్కలదాడిలో 20 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల కాపరుల వివరాల ప్రకారం వల్లంపట్ల గ్రామానికి చెందిన దయ్యాల ఎల్లయ్య, ముద్దాల బాలయ్య, వట్టి ఎల్లయ్య, దయ్యాల లచ్చయ్యలు మేతకోసం గొర్రెలను గురువారం గాలిపెల్లి గ్రామ సమీపంలోకి తీసుకెళ్లారు. అటుగా వచ్చిన కుక్కలు గొర్రెలపై దాడిచేయడంతో 20గొర్రెలు, మేకలు మృతిచెందాయి. సంఘటనలో తమకు దాదాపు రూ. 1.5లక్షల నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గొర్లకాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయనర్సింహరెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, ఫిబ్రవరి 29 : ముండలంలోని ఆవునూర్ పరిధిలో గల ఎగువమానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని ఠాణాకు తరలించినట్లు ఆర్ఐ శ్యాంకుమార్ గురువారం తెలిపారు. ఇసుక కోసం టోకెన్ తీసుకొని అనుమతి తీసుకున్న స్థలంలో కాకుండా వేరే చోటకు తరలిస్తుండగా పట్టుకొని ఠాణాకు పంపినట్లు తెలిపారు. ట్రాక్టర్లపై చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

బీర్‌పూర్,ఫిబ్రవరి 29: బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాలలో చివరి ఘట్టం స్వామి వారి రథోత్సవం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని గుట్టపై నుంచి గుట్ట కిందికి ప్రత్యేకంగా అలంకరించిన శావపై ఆశీనుల గావించి డప్పు చప్పుళ్ల మధ్య గుట్ట కిందికి తీసుకవచ్చారు. రథం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని రథంపై ఆశీనులు గావించి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్ట కింద ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వంటలు చేసుకుని భోజనాలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు చెందిన ఆరుగురు ఎస్సైలు, ఆరుగురు ఏఎస్సైలు, పోలీసు సిబ్బందితో డీఎస్పీ రఘుచందన్, జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్‌ఆలీఖాన్, బీర్‌పూర్ ఎస్సై గౌతమ్ పవర్ ఆధ్వర్యంలో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ఈ జాతర బ్రహ్మోత్సవాలలో ఎంపీపీ మసర్తి రమేష్, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మన్ రావ్, బీర్‌పూర్ సింగిలివిండో చైర్మెన్ కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, ఉత్సవ కమిటీ చైర్మన్



స్వామివారి రథోత్సవం, స్వామివారు (ఇన్‌సెట్‌లో)

ఎనగంటి సామ్రాట్, ఆలయ కార్యనిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, మాజీ ఆలయ చైర్మెన్‌లు గోనే రమణ రావ్, నేరెల సుమన్, మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, మధు కుమార్, చిన్న సంతోష్, క్లర్క్ రాజయ్య, సిబ్బంది వెంకటేష్, మల్లయ్య, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల కస్టడీలో నందెల్లి మహిపాల్, కృష్ణగౌడ్

● కరీంనగర్‌లో సోదాలు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 29: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడిన కేసులో ఈ నెల 20న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు గురువారం ఉదయం కస్టడీకి తీసుకున్నారు. అనంతరం నాలుగు ప్రత్యేక పోలీసు టీంలు ఏకకాలంలో జ్యోతినగర్, శర్మనగర్, ముకరంపురల్లో మహిపాల్ ఇళ్లతో పాటు అతడి అనుచరుల ఇళ్లు, కార్యాలయాల్లో 6 గంటల పాటు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నందెల్లి మహిపాల్ సమక్షంలోనే ఆయన ఇళ్లు, కార్యాలయంలలో సోదాలు జరిపారు. శుక్రవారం ఉదయం వరకు మహిపాల్ పోలీసుల కస్టడీలో ఉండనున్నారు.

● రేకుర్తిలోని ఒక భూమికి సంబంధించి నకిలీ ధ్రువపత్రాలను నిజమైనదిగా చూపించి బాధితుడి నుంచి కోటి 37 లక్షల రూపాయలు వసూలు చేసిన కేసులో నిందితుడిగా జిల్లా జైలులో ఉన్న కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్‌ను గురువారం కొత్తపల్లి పోలీసులు కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ఈనెల 9న



నందెల్లి మహిపాల్‌ను కస్టడీకి తీసుకుని సోదాలకు వెళుతున్న పోలీసులు

కృష్ణగౌడ్ అరెస్టు అయి జైలులో ఉండగా అతన్ని మరింత లోతుగా విచారించాలని పోలీసులు కోర్టులో కస్టడీ పిటిషన్ వేయగా 24 గంటల కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ మేరకు కృష్ణగౌడ్‌ను కస్టడీకి తీసుకుని విచారణ జరుపుతున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

### భూ తగాదాల్లో తలదూర్చిన వ్యక్తిపై పీడీ యాక్ట్



పీడీ యాక్ట్ అమలు కాపీ అందజేస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 29: భూ తగాదాల్లో తలదూర్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన పి.రమణారెడ్డికి గురువారం వేములవాడ పోలీసులు పీడీయాక్టు నిర్బంధ ఉత్తర్వులు అందజేసి అమలుచేసి చర్లపల్లి జైలుకు తరలించారు. చంద్రంపేటకు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి రిపోర్టర్‌గా పనిచేస్తూ భూ సమస్యలు, ఇతర సమస్యల్లో తలదూరుస్తూ అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతూ ప్రజలకు భయభ్రాంతులకు గరిచేస్తున్నాడని అతనిపై సిరిసిల్ల, తంగళ్లపల్లి, కోనరావుపేట, వేములవాడ పోలీస్‌స్టేషన్‌లలో దాదాపు 10కేసులు నమోదయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. అయినప్పటికీ అతని కార్యకలాపాలు మార్చుకోనప్పటికీ జిల్లా కలెక్టర్ అనురాగ్‌జయంతి పీడీ యాక్ట్ అమలు చేయడానికి ఉత్తర్వులు ఇవ్వగా ఎస్పీ అఖిల్ మహజన్ ఆదేశాల మేరకు అతనికి పీడీ యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు అందజేసి నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

### ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు టెట్ అర్హత మార్కులు తగ్గించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే అర్హత పరీక్ష(టెట్)లో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అర్హత మార్కులు తగ్గించాలని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి నంది తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో అర్హత సాధించాలంటే, ముందుగా బీఈడీ, టీటీసీ చేసిన అభ్యర్థులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో అర్హత సాధించాల్సి ఉందని తెలిపారు. ఈ పరీక్షలో ఓసీలు 90, బీసీలు 75, ఎస్సీలు 60 మార్కులు సాధించాలన్నారు. 89 సాధించిన ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ఒక్క మార్కుతో వేల సంఖ్యలో అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. కావున ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు బీసీల మాదిరిగానే 75 మార్కులకే అర్హత కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమస్యపై దృష్టి సారించి ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

### స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

చందుర్తి, ఫిబ్రవరి 29: జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ నిరుపేద మృతి చెందగా మృతదేహం చందుర్తి మండలంలోని బండపల్లికి చేరుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోతుగంటి భూమయ్య (46) గుండెపోటుతో ఫిబ్రవరి 3న గల్ఫ్‌లో మృతి చెందా డు. రాత్రి భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటుండగా గుం డెపోటు వచ్చింది. సహచరులు వెంటనే ఆసుపత్రి తరలిం చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మృతదేహం గ్రామానికి రావడంతో కుటుంబ సభ్యులు రోధించడం కంటతడి పెట్టించింది. కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### ఉద్యోగాల పేరుతో మోసం కేసులో పెరుగుతున్న బాధితులు

మరో ఏడుగురి వద్ద రూ. 6లక్షల టోకరా

గంభీరావుపేట, ఫిబ్రవరి 29: అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల ఆశతో మోసపోయిన బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ. 9 లక్షలు దండుకున్న ఘటన మరిచిపోక ముందే ఇదే కోవలో మరికొందరు వెలుగులోకి వచ్చారు. వీరిని మోసం చేసింది కూడా ఎర్రవెల్లికి చెందిన అర్జున్ కావడం విస్మయం కలిగిస్తోంది. ఉద్యోగాల పేరిట వరుస టోకరాలు చూస్తుంటే అర్జున్ చేతిలో ఇంకెంత మంది మోసపోయారనే అనుమానాలు బలపడుతున్నాయి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో పలువురు అమాయక యువకులను మోసం చేసిన వ్యక్తుల్లో ఒకరైన ఎరవెల్లికి చెందిన అర్జున్ గంభీరావుపేట మండలంలోని లింగన్నపేటకు చెందిన మరో ఏడుగురిని ఇదే రకంగా మోసం చేశాడనే అంశం వెలుగు చూడటం కలకలం రేపుతోంది. అర్జున్ శివ పేరుతో సూర్య, సుజాత అనే వ్యక్తుల సహకారంతో లింగన్నపేటలో మరో ఘరానా మోసానికి తెరలేపాడు. దాదాపు లింగన్నపేటకు చెందిన ఏడుగురు వ్యక్తుల వద్ద కాస్ ఫౌండేషన్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.6 లక్షల వరకు వసూలు చేశాడు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో పెట్టించే అధికారులు సూర్య, సుజాత అంటూ వారిని పరిచయం చేస్తూ అర్జున్ అలియాస్ శివ పలు దఫాలుగా డబ్బు వసూలు చేశాడు. లింగన్నపేటకు చెందిన బాధితురాలు తండ్రి పురుషోత్తం గంభీరావుపేట ఎస్ఐ రాంమోహన్‌కు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి నిందితుడైన అర్జున్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

### అట్రాసిటీ కేసులపై డీఎస్పీ విచారణ


ముస్తాబాద్, ఫిబ్రవి 29: ముస్తాబాద్ మండల పోలీసు ఠాణా పరిధిలో ఇటీవల నమోదైన అట్రాసిటీ కేసులపై సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ గురువారం విచారణ చేశారు. ఎస్టీ మహిళ పెట్టిన కేసుతో పాటు, పారిశుధ్య సిబ్బంది పెట్టిన అట్రాసిటీ కేసులపై క్షేత్ర స్థాయిలో డీఎస్పీ విచారణ చేశారు. ఏఎస్సై వెంకటరమణ, పీసీ కుమార్ ఉన్నారు.

### గౌడ సంఘం ఆధ్వర్యంలో 10న మంత్రి 'పొన్నం'కు సన్మానం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో మార్చి 10న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మాన కార్యక్రమం ఉంటుందని జిల్లా గౌడ సంఘం నాయకులు తెలిపారు. గురువారం నగరంలోని మాచర్ల గార్డెన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల గణన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పొన్నం ప్రభాకర్‌కు సన్మాన సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పెద్ద ఎత్తున గౌడ కులస్థులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాచర్ల ప్రసాద్, పొన్నం శ్రీనివాస్, పొన్నం సత్యం, జగన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయాలి

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్



సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయకార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని డబుల్‌బెడ్‌రూం లబ్దిదారులకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్‌రూం లబ్దిదారులను గురువారం కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం జరిగి సంవత్సరాలు గడిచిపోయాయని, లబ్దిదారులను సైతం గ్రామసభల ద్వారా ఎంపిక చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ఇళ్లను పంపిణీ చేయలేదన్నారు. ఓపిక నశించిన లబ్దిదారులు డబుల్‌బెడ్‌రూంలలో ఉంటున్నారని తెలిపారు. వారికి విద్యుత్ సరఫరా నిలిపివేయడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేయాలని లేనట్లయితే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘ జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య, నాయకులు పసుల బాలరాజు, బైండ్ల మల్లేశం, మహేష్, నర్సవ్వ, రేణుక, లక్ష్మి, బాగ్యలక్ష్మి, చంద్రయ్య, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

● పల్లిమక్తలో చోరీ ● రూ.70 వేలు అపహరణ

కోనరావుపేట, ఫిబ్రవరి 29: తాళం వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడుతున్నారు. గత నెలలో కూడా సుమారు నాలుగు గ్రామాల్లో వరస దొంగతనాలు జరిగాయి. అది మరవక ముందే బుధవారం రాత్రి పల్లిమక్త గ్రామంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శనిగరం దేవవ్వ, నందగిరి వజ్రవ్వల ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో చోరీ చేశారు. తాళాలను పగలగొట్టి శనిగరం దేవవ్వ ఇంటిలో 70 వేల రూపాయలను అపహరించారు. నందగిరి వజ్రవ్వ ఇంటిలో కూడా తాళం



పల్లిమక్తలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆ ఇంటిలో ఏమి దొరకలేదు. విషయం తెలుసుకున్న చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి దొంగతనం జరిగిన తీరును పరిశీలించి డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపడుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం


మొగిలిపేటలో కల్యాణం జరుపుతున్న పురోహితులు

మల్లాపూర్, ఫిబ్రవరి, 29 : మండలంలోని మొగిలిపేట గ్రామంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని పురోహితులు ఘనంగా జరిపారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం స్వామి వారికి ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, పూజలు జరిపారు. పురోహితుల వేదమంత్రోత్సవాల మధ్య స్వామి వారి కల్యాణం వైభవంగా జరిపించారు. నిర్మల్, జగిత్యాల జిల్లాలోని పలు మండలలోని భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించి పూజలు నిర్వహించి తీర్థ ప్రసదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు సతిసమేతంగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణంలో పాల్గొని భక్తులకు నిర్వహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రయోగాలతోనే సృజనాత్మకత పెరుగుతుంది


విద్యార్థులు తయారుచేసిన పరికరానలు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 29 : ప్రయోగాలు చేయడంతోనే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ప్రిన్సిపాల్ బుర్ర ప్రసాద్‌గౌడ్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని బ్రూక్లిన్ గ్రామర్ హైస్కూల్‌లోని విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన ప్రయోగాలు తయారు చేశారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలతో కార్యక్రమం చేపట్టి ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులకు వివరించారు. ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సహ బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతున్న తరగతుల్లోని వాటిపై ప్రయోగం చేయడం వల్లనే సబ్జెక్టుపై పట్టు పెరుగుతుందన్నారు. విద్యార్థులు ఇదే ఉత్సాహంతో చదువులో రాణించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుర్ర జయలక్ష్మి, దేవేందర్‌గౌడ్, బృందం పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, ఫిబ్రవరి 29 : మండల కేంద్రంలో నిర్మిస్తున్న గుండ్రప్ప శివాలయ పునర్నిర్మాణానికి గురువారం మండల కేంద్రానికి చెందిన మాణిక్యం శ్రీనివాస్ 50116 రూపాయలను, దీకొండ అశోక్‌పద్మ దంపతులు 5001 రూపాయలు, దీకొండ చంద్రశేఖర్‌రాధిక దంపతులు 5001 రూపాయలు, దొంతుల నారాయణ కుటుంబ సభ్యులు 5001 రూపాయలు, పిల్లి లింగంకుమార్ లలిత దంపతులు 5016 రూపాయలను విరాళంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. ఇదిలా ఉండగా గ్రామంలోని ఊర పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి పిల్లి లింగంకుమార్ దంపతులు 5016 రూపాయలను అందించారు. దాతలకు కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## పౌరహక్కుల దినోత్సవం

పెగడపల్లి, ఫిబ్రవరి 29 : మండలంలోని సుద్దపల్లిలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అంటరాని తనం నిర్మూలన, మూడనమ్మకాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంటరానితనం పేరుతో వివక్షకు గురి చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని సూచించారు. గ్రామసభలో రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**కొడిమ్యాల :** మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో గురువా రం రెవెన్యూ, పోలీస్ అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ అర్షరాజు, ఎంపీటీసీ మల్లారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తోనే బీసీలకు న్యాయం

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 29 : కాంగ్రెస్ తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి మాజీ సర్పంచ్, బీసీ సంక్షేమసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుంటి గంగారాం అన్నారు. గురువారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్, జగిత్యాల రూరల్ ఎంపీపీ సీట్లను గత ఎన్నికల్లో రిజర్వేషన్ ప్రకారం బీసీల కేటాయించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీసీల హక్కులను కాలరాసి ఓసీ వర్గానికి చెందిన వ్యక్తులు బీసీల రిజర్వేషన్లను అనుభవించారని విమర్శించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవ తీసుకొని బీసీలకు న్యాయం జరిగేలా రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నుంచి జీవో తీసుకువచ్చి బీసీలకు న్యాయం చేశారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి గంగారాం కృతజ్ఞతలు తెలిపారు.

## రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతి


కొత్త పావని

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 29 : మండలంలోని సత్తక్కపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి పావని ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపికయింది. ఫిబ్రవరిలో విడుదలైన పీజీటీ పోస్టుల ఫలితాల్లో పావని ఉద్యోగం సాధించగా గురువారం రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ లెక్చరర్ పోస్టు ఫలితాలు విడుదల చేయగా అందులోనూ పావనికి ఉద్యోగం లభించింది. పావని ఎమ్మెస్సీ, బీఈడీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేసింది. ప్రస్తుతం ఒక ఉద్యోగం సాధించడమే కష్టంగా ఉండే రోజుల్లో ఒకేసారి రెండు ఉద్యోగుల సాధించి తోటి వారికి ఆదర్శంగా నిలుస్తోంది. రెండు ఉద్యోగాలు సాధించిన కొత్తపల్లి పావని పలువురు అభినందించారు. మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన వన్నెల గణేష్ జూనియర్ లెక్చరర్‌కు ఎంపికయ్యాడు. గణేష్ డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనియవర్సిటీలో డిపార్ట్ మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్ మెంట్ లో పిహెచ్‌డీ చేస్తున్నారు.

## ఘనంగా క్రీడోత్సవం


క్రీడలో రాణించిన విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

కోరుట్ల, ఫిబ్రవరి 29 : పట్టణంలోని గౌతమ్ మాడల్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠశాల నిర్వహకులు క్రీడోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీన్ పర్యవేక్షలో వ్యాయామ ఉపాధ్యాయుడు మద్దం ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు క్రీడల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ నిర్వహించారు. వివిధ క్రీడలలో రాణించిన విద్యార్థులకు పాఠశాల డీన్ నర్సింహారాజు బహుమతలును అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐస్కూల్ ఇన్‌చార్జి రాజశ్రీలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# బలహీనవర్గాల హక్కుల రక్షణే కాంగ్రెస్ ధ్యేయం

- సీఎం చొరవతో మున్సిపల్, పంచాయతీ రాజ్ చట్టంలో మార్పులు చేశాం
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల హక్కుల రక్షణే కాంగ్రెస్ ధ్యేయమని, సీఎం రేవంత్ రెడ్డి చొరవతో మున్సిపల్, పంచాయతీ రాజ్ చట్టంలో మార్పులు చేశామని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలన పరమైన సాంకేతిక మార్పులు చేయడం వల్లనే జగిత్యాల మున్సిపల్, జగిత్యాల మండల అధ్యక్షుల ఎన్నికలను నిర్వహించడం సాధ్యమైందన్నారు. ఇందుకు కృషి చేసినందుకు గర్వపడుతున్నానన్నారు. జగిత్యాల మున్సిపల్‌లో చైర్‌పర్సన్ పదవిని దక్కించుకోవడానికి బీఆర్ఎస్‌కు అవసరమైన సంఖ్యాబలం ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఒంటెద్దు పోకడ, నియంతృత్వ దోరణి, మొండి వైఖరి వల్లే పదవిని రెబల్ అభ్యర్థి కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విప్ ఎందుకు జారీ చేయలేదని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించడం హస్యాస్పదంగా ఉందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విప్‌ను దిక్కరించిన కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం వింతగా ఉందన్నారు. విప్ నియామక ప్రక్రియ జరిగిందా...లేదా అని ప్రశ్నించారు. విప్ నియామక ప్రక్రియ నిబంధనల ప్రకారం చేయడం, బీఆర్ఎస్ కౌన్సిలర్ల సమావేశాన్ని నిర్వహించడం, విప్ విషయాన్ని చర్చించడం, సమాచారాన్ని అందజేయడం తదితర పనులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇవన్నీ జరిగాయా, లేదా అని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో సమయానుకూలంగా వ్యవహరించిందన్నారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిని కాంగ్రెస్ గెలిపించాలని ఎమ్మెల్యే సంజయ్ కోరుకోవడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో జగిత్యాల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బండారి నరేందర్ మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బీఆర్ఎస్ కౌన్సిలర్లందరినీ సమన్వయ పరిచి బండారి నరేందర్ సతీమణి కౌన్సిలర్ బండారి రజినీని చైర్‌పర్సన్ ఎన్నుకుంటే అందరూ హర్షించే వారన్నారు. సర్పంచ్ ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించడాన్ని ఖండిస్తున్నానన్నారు. గతంలో 2018లో పార్లమెంట్ ఎన్నికల కారణంగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించని విషయం తెలిసిందేనని గుర్తు చేశారు. ప్రస్తుతం సైతం సర్పంచ్ ఎన్నికలు ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. ఇదిలా ఉండగా కేటీఆర్ మూడు నెలల కిత్రమే మేడిగడ్డకు వెళ్లాల్సి ఉండేదని, ఇప్పటికైనా కేటీఆర్ మేడిగడ్డ సందర్శనకు వెళ్తుండడం స్వాగతిస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైనింగ్ రూపొందించిన ఇంజనీర్‌ను ఉరితీయాలన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, ప్రముఖ న్యాయవాది జగదీశ్వర్, జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు గాజెంగి నందయ్య, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య పాల్గొన్నారు.

## గతంలో నిర్ణయించిన ప్రకారమే హైవే రోడ్డు నిర్మాణం చేపట్టాలి

### ఆందోళనకు దిగిన భూయజమానులు

కోరుట్ల, ఫిబ్రవరి 29 : జగ్‌దల్‌పూర్ నుంచి నిజామా బాద్ వరకు నూతనంగా నిర్మాణం చేస్తున్న నేషనల్ హైవే గతంలో నిర్ణయించిన ప్రకారమే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం సంబంధిత భూ యజమానులు పట్టణ శివారులోని నాగులపేట రోడ్డులో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా భూయజమానులు మాట్లాడుతూ గతంలో సర్వే చేసి నిర్ణయించిన ప్రకారం జాతీయ రహదారిని నిర్మాణం చేసి తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. సంబంధిత విషయంపై సీఎంతో పాటు మంత్రులకు వినతి పత్రాలను సమర్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఎంత ఇస్తారో ముందే ప్రకటించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కిషన్ ఆందోళన విరమించే ప్రయత్నం చేసారు. భూయజమానులు శ్రీనివాస్, నరేందర్, రాంగోపాల్, చంద్రబాబు, హరీష్, చంటి శ్రీనివాస్, పసుల కృష్ణాప్రసాద్ పాల్గొన్నారు.


ఆందోళనకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

## నైపుణ్యంతో కూడిన విద్య అందించాలి


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

రాయికల్, ఫిబ్రవరి 29: విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలని రాయికల్ తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం అన్నారు. రాయికల్ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో గ్రీన్ ఫుడ్ హైస్కూల్ వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఖయ్యూం మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక, సాంఘీక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్యను అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని అన్నారు. రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు మాట్లాడుతూ పాఠశాల స్థాయి విద్యనే విద్యార్థులకు కీలకమని, చిన్నప్పటి నుంచి తల్లి దండ్రులు విద్యార్థులను శ్రద్ధతో చదివించాలని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జడ్పీటీసీ అశ్విని జాదవ్, ప్రెస్ క్లబ్ ఏఏసీ అధ్యక్షుడు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, పాఠశాల నిర్వాహకులు, సిబ్బంది మిట్టపెల్లి మహేష్, కాకెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొటోకాల్‌పై ఎమ్మెల్యే మాట్లాడటం విడ్డూరం

### బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి


వేంపేటలోని సమావేశంలో మాట్లాడుతున్న అల్లూరి మహేందర్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 29 : ప్రొటోకాల్ పాటించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే మాట్లాడటం విడ్డూరంగా ఉందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని వేంపేట గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జువ్వాడి నర్సింగరావుల చిత్రపటాలకు ఆయన ఆధ్వర్యంలో నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లోని గృహజ్యోతి పథకం ద్వారా 200యూనిట్ల ఉచిత కరెంట్, మహాలక్ష్మి పథకం ద్వారా రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌ను ప్రారంభించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ క్షీరాభిషేకం చేశామన్నారు. గతంలో కోరుట్ల ఎమ్మెల్యేగా కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఉన్న సమయంలో ఏ పదవిలో లేకున్న తమ చేతుల మీదుగా ప్రజలకు అందజేసిన కల్యాణలక్ష్మీ, ప్రొసీడింగ్ పత్రాలు ఇచ్చినప్పుడు గుర్తుకు రాని ప్రోటోకాల్ ఇప్పుడు ఎందుకు గుర్తుకొచ్చిందని ప్రశ్నించారు. మీకో న్యాయం మాకో న్యాయమా అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్, అల్లూరి సురేందర్‌రెడ్డి, తుమ్మల లింగారెడ్డి, పల్లి శేఖర్‌గౌడ్, తుమ్మల మహేందర్‌రెడ్డి, పోతుగంటి నారాయణగౌడ్, సాకలి శంకర్ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 29: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని గురువారం సిరిసిల్లలో లేబర్ ఆఫీసర్‌కు టీఎస్ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు గాజుల పోశెట్టి, ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ 60 సంవత్సరాలుపై బడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు ఆరువేల రూపాయల పెన్షన్ ఇవ్వాలన్నారు. కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులకు రాష్ట్రస్థాయి సలహాబోర్డులో సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్స్, ఇతర బెనిఫిట్ బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. కార్మికుల అడ్డాల వద్ద కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ. 10 లక్షలు ఇవ్వాలన్నారు.

## ఎరువుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి వాణి

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 29 : రైతులకు విక్రయించే ఎరువుల వివరాలను సక్రమంగా నమోదు చేసి నిలువ ఉన్న వాటి వివరాల ప్రకారం ఎరువులను గోదాంలో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారిణి వాణి అన్నారు. గురువారం మండలంలోని మాదాపూర్, అయలాపూర్ గ్రామాలలోని సింగిల్ విండో గోదాంను పరిశీలన జరిపి నిలువ ఉన్న ఎరువులను పరిశీలించి విక్రయించిన ఎరువుల వివరాల రికార్డును తనిఖీ చేశారు. అయిలాపూర్ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో జీరో టిల్లెజ్‌తో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను వ్యవసాయ అధికారిణి పరిశీలించారు. పంటలో కత్తెర పురుగ శోకే అవకాశం ఉన్నందున ఇమామెక్టిన్ బెంజోఏటో లేదా కోరాజెన్ మందును పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసా అధికారిణి నాగమణి ఎఈవో మమతలతో పాటు రైతులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా చెరువు పూడికతీత పనులు


పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

మల్లాపూర్, ఫిబ్రవరి, 29 : మండలంలోని చెరువు పుడికతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కొన్ని రోజుల నుంచి మండలంలోని చెరువు మట్టిని తొలగించాలని రైతులు అధికారులను కోరినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పలుమార్లు మండలంలోని అధికారులకు సమస్యను తెలిపినా ఫలితం లేకపోవడంతో ఇబ్బందులు గురయ్యారు. కొంత కాలం నుంచి సాగు చేస్తున్న పొలాలకు నీరు అందక ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. చెరువు పూడికతీత పనులు చేపట్టడంతో నీటి నిల్వ పెరిగి పంట పొలాలకు సాగు నీటి సమస్యలు ఉండవని రైతులు సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టి తీసుకెళ్లగా వారు అధికారులకు ఆదేశించారు. గురువారం మండలంలోని సాతారం గ్రామ శివారులోని చెరువుకు ఉపాధిహామీ కార్మికులచే పూడికతీత పనులను చేపట్టారు.

చెరువు నుంచి పంట పొలాలకు నీరు సరఫరా కావడానికి పిల్లకాలువలలోని మట్టిని తీసి ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. దీంతో గ్రామంలోని పంటపొలాలకు నీటి సరఫరా జరుగుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. చెరువు పూడికతీతలో తీసిన మట్టిని పొలాల వేసుకుంటే భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని అధికారుల సూచించారు. దీంతో చెరువులో తీసిన మట్టిని పంట పొలాలకు రైతులు ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లారు.

## ఒర్రెను పరిశీలించిన ఎమ్మెల్యే

కథలాపూర్, ఫిబ్రవరి 29 : మండలంలోని చింత కుంటలో వొన్నయ్య ఒర్రెను వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. రాజారాం తండాకు శుభకార్యానికి హాజరై వస్తున్న క్రమంలో రైతులు తెగిన ఒర్రెపై వంతెన నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో వెంటనే ఆర్‌అండ్‌బీ ఈఈకి ఫోన్‌లో మాట్లాడి అంచనాలు రూపొందించి తన పంపించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## ఆడిట్ బృందానికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూప

కొడిమ్యాల, ఫిబ్రవరి 29 : మండలంలోని వివిధ గ్రామాలలోకి రానున్న సోషల్ ఆడిట్ బృందానికి గ్రామాలలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సహ కరించాలని ఎంపీడీవో స్వరూప కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిట్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధిహామీ పథకంలో చేసిన పనులను ఆడిట్ బృందానికి చూపాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఆర్‌పీ తిరుపతి, జడ్పీటీసీ ప్రశాంతి, డీవీవో చిన్నయ్య, అంబడ్స్‌మెంట్ పర్సన్ కృష్ణారెడ్డి, ఏపీవో సతీష్, ఈసీ రమాపతి, టెక్నీకల్ అసిస్టెంట్ భువన్, శ్రీనువాస్, గౌతం, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కథలాపూర్, ఫిబ్రవరి 29: మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ ముంతాజీబోద్దీన్, వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్ రావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బొద్దు బాలు, దొప్పల హైమావతి, మల్యాల రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నగేశ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

రాయికల్, ఫిబ్రవరి 29: రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాల, విశ్వశాంతి ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు జమాతె ఇస్లామిక్ హింద్ స్టూడెంట్ వింగ్ గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమాతె ఇస్లామి హింద్ రాయికల్ అధ్యక్షుడు ఎండీ షంషేర్ ఉల్ హక్, సభ్యులు ఎండీ అబ్దుల్ నయీం, ఎండీ మజహర్, జీఐవో సభ్యులు తూబా ఫాతిమా, సానియా ముస్కాన్, రింశా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు 5కె రన్: ఎస్పీ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 29: జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం మార్చి 3న సిరిసిల్లలో 5కె రన్ నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 5కె రన్‌లో ఆసక్తి గల యువతీ, యువకులు, విద్యార్థులు, ఉద్యోగస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇందుకోసం జిల్లా పోలీసు కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. యువత మంచి భవిష్యత్ కోసం ప్రతీఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడా నికి కృషిచేయాలన్నారు. 5కె రన్‌లో పాల్గొనే వారు ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్దకు రావాలని ఆయన తెలిపారు. 5కె రన్‌లో మొదటి మూడు బహుమతులు పోలీస్, పాత్రికేయులు, సిటిజన్స్, మిగితా మండలాల వారికి బహుమతులు అందజేస్తామన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, అలవాటు పడిన వ్యక్తుల మానసిక స్థితి, మానవ జీవితంపై చూపే ప్రభావం, నాడీవ్యవస్థ తీరుపై నిపుణులైన వైద్యులతో ఎల్ఈడీ స్క్రీన్‌పై అవగాహన కల్పిస్తామని ఎస్పీ తెలిపారు.

## నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తాం

సిరిసిల్ల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలకు కావాల్సిన బట్ట ఉత్పత్తి ఆర్డర్ల కోసం జీవో ఇచ్చి సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంపై తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్, ఆసాముల సమన్వయ కమిటీ, సీఐటీయూ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ మంత్రి తుమ్మలను కలిసి వినతిపత్రం అందించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఏర్పడిన సంక్షోభం, ఉపాధిలేక కార్మికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బతుకమ్మ చీరల ఆర్డర్లు లేక పవర్‌లూం పరిశ్రమను యజమానులు మూసివేశారని కార్మికులు పనిలేక ఆర్థిక ఇబ్బందులతో కుటంబ పోషణభారమై ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు.